
క్లుప్తంగా

పవన్‌కుమార్‌కు డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో ని కెమిస్ట్రీ విభాగంలో పరిశోధకుడు చెరుకు పవన్‌కుమార్‌కు యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటించింది. 'సింథసిస్ ఆఫ్ కానస్టూనాలిడ్‌డి హైడ్రోకాస్టస్ లాక్టోన్ అండ్ గార్సినల్ డెరివిటీస్ అండ్ ఎవాల్యూయేషన్ ఆఫ్ థేయిర్ బయాలజికల్ యాక్టివిటీ' అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి పవన్‌కుమార్‌కు డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య కె.రాజేందర్ తెలిపారు. హైదరాబాద్ ఐఐసిటి ఆచార్యులు డాక్టర్ కె నరేష్‌బాబు పర్యవేక్షణలో పవన్‌కుమార్ తన పీహెచ్‌డీ పూర్తి చేశారు.

రేషన్ బియ్యం పట్టివేత

రామన్నపేట : మట్టెవాడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పోచమ్మమైదాన్‌లో ఏనుగుల ప్రభాకర్ వద్ద అక్రమంగా నిల్వ చేసిన రూ. 39 వేల విలువ చేసే 15 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. అలాగే రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలించేందుకు ప్రభాకర్‌తో వ్యాపారం చేసిన కిగువా సన్యాసి నాయుడుపై కేసు నమోదు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు.

పరీక్షల నియంత్రణ అధికారికి సన్మానం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణాధికారిగా బాధ్యతలు స్వీకరించిన ఆచార్యులు కె.రాజేందర్‌ను మంగళవారం బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కేయూ ఇన్‌చార్జ్ ఆరెగంటి నాగరాజు ఇతర బాధ్యులు శాలువాతో సన్మానించి పూల బొకేను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రీసెర్చ్ స్కాలర్ నిరుద్యోగ జేఏసీ రాష్ట్రకార్యదర్శి తాళ్లపెల్లి నరేష్‌గౌడ్, బోస్కనాగరాజు, శ్రీసాయి, వేణు పాల్గొన్నారు.

నేడు జిల్లాస్థాయిలో ప్రతిభా పరీక్ష పోటీలు

విద్యారణ్యపురి: తెలంగాణ గణిత ఫోరం హనుమకొండ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 11న జిల్లా స్థాయిలో విద్యార్థులకు గణిత ప్రతిభా పరీక్ష పోటీలు హంటర్‌రోడ్డులోని రీజినల్ సైన్స్ సెంటర్‌లో నిర్వహించనున్నారు. ఇప్పటికే జిల్లాలోని అన్ని మండలాల్లో పరీక్ష పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రతి మండలం నుంచి మూడు కేటగిరీల ద్వారా 6 నుంచి 9 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. ఈనెల 11న సైన్స్‌సెంటర్‌లో ఉదయం 9–30గంటల నుంచి సాయంత్రం 4–30 గంటల వరకు వివిధ కార్యక్రమాలు జరగుతాయని గణిత ఫోరం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు తొటం భాస్కర్, ప్రధాన కార్యదర్శి బోయినపెల్లి మహేష్, కోశాధికారి పుల్లూరు మల్లికార్జున్ తెలిపారు.

సబ్సిడీ రుణాలందించాలి

కాజీపేట: రాష్ట్రప్రభుత్వం బీసీ కార్పొరేషన్ ద్వారా నిరుద్యోగులకు సబ్సిడీతో కూడిన రుణాలు అందించాలని తెలంగాణ బీసీ బహుజన సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బర్కం రాంమోహన్ డిమాండ్ చేశారు. 61వ డివిజన్ ప్రశాంత్‌నగర్ కాలనీలో మంగళవారం ఏర్పాటుచేసిన సంఘం విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతు గతంలో మాదిరిగా బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు అందించి ఆదుకోవాలని కోరారు. 2024–25 యాక్షన్ ప్లాన్‌ను ఏర్పాటు చేసి చేయూతనందించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర మంత్రి సబ్సిడీ రుణాలపై అధికారులకు మార్గదర్శకాలు విడుదల చేయాలని కోరారు. దామెరుప్పుల జనార్దన్, పైడిపాల వెంకన్న, చందనాల ప్రవీన్, రావుల సురేష్, అబ్బోజు శంకర్ పాల్గొన్నారు.

23 నుంచి ఏబీవీపీ రాష్ట్ర మహాసభలు



కేయూ క్యాంపస్: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) రాష్ట్ర మహాసభలు ఈనెల 23, 24, 25 తేదీల్లో నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన వాల్ పోస్టర్లను ఏబీవీపీ యూనివర్సిటీ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం క్యాంపస్‌లోని క్యాంటీన్ ఆవరణలో ఆవిష్కరించారు. ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు మాచర్ల రాంబాబు మాట్లాడుతూ జాతీయ పునర్నిర్మాణం సాధ్యమనే ఉద్దేశ్యంతో పని చేస్తున్నది ఏబీవీపీ అన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ కేయూ ఇన్‌చార్జ్ నిమ్మల రాజేష్, నాయకులు అంబాల కిరణ్, గట్టు ప్రశాంత్, సాయికుమార్, రాజ్‌కుమార్, అఖిల్, ఉదయ్, మల్లేష్ ,శివ తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో చదివి ఉత్తమ పౌరులుగా ఎదగాలి

హసన్‌పర్తి : విద్యార్థినులు పట్టుదలతో చదివి ఉత్తమ పౌరులుగా ఎదగాలని చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ సభ్యుడు కజాంపురం దామోదర్ అన్నారు. హసన్‌పర్తిలోని తెలంగాణ బాలికల గురుకుల పాఠశాలలో మంగళవారం సంస్కారం వికాస శిక్షణ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అశోక్‌రెడ్డి, సంపత్, సీనియర్ సిటీజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి యుగంధర్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల్లో సాకరాసికుంట

- కాలనీలో లోపించిన పారిశుద్ధ్యం..
- ఇబ్బంది పడుతున్న ప్రజలు

ఖిలా వరంగల్: వరంగల్ 39వ డివిజన్ సాకరాసికుంట ప్రజలు కొన్నేళ్లుగా అభివృద్ధికి దూరంగా ఉండి తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇక్కడ సుమారు 1200 మంది ఓటర్లు, 2600ల జనాభా ఉన్నారు. కాలనీల్లో డ్రెయినేజీలు, తాగునీరు నాటి సరఫరా అస్తవ్యస్తంగా ఉంటుంది. పారిశుద్ధ్యం పనులు సక్రమంగా చేపట్టకపోవడంతో ఎక్కడ చూసినా చెత్తాచెదారం దర్శనమిస్తోంది. కుళ్లిన చెత్త నుంచి వచ్చే దుర్వాసన భరించలేకపోతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెత్తపై పందులు స్వైరవిహారం చేస్తున్నాయని, దీంతో విషజ్వరాల బారిన పడుతున్నామని వాపోతున్నారు.

తాగునీటి కోసం తండ్లాట..

కాలనీ ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికి తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పైపులైన్ ద్వారా రోజు విడిచి రోజు సరఫరా చేసే తాగునీరు కనీసం బిందె నీరు రావడం లేదని వాపోతున్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు.



ఇళ్ల మధ్యలోనే చెత్తాచెదారం, మురుగునీరు



అస్తవ్యస్తంగా ఉన్న డ్రెయినేజీ

అవస్థలు పడుతున్నాం..



కాలనీలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. ఖాళీ స్థలాల్లో చెరువులను తలపిస్తున్నాయి. చిన్నపాటి వర్షం వస్తే, మురుగు నీటిలోనే కాలం వెల్లదీస్తున్నాం. మురుగునీరు నిల్వతో దుర్వాసన వెదజల్లడమే కాకుండా దోమలు, పందులు స్వైరవిహారం చేస్తున్నాయి.

– మాదాసి రాజు, స్థానికుడు

విద్యార్థుల మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి

- ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కిరణ్

విద్యారణ్యపురి: తెలంగాణ రాష్ట్రంలో ఫుడ్ పాయిజన్‌తో మృతిచెందిన విద్యార్థుల మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెర కిరణ్ అన్నారు. మంగళవారం హనుమకొండ రాంనగర్‌లోని ఎస్‌ఎఫ్‌ఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలోఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోనికి వచ్చి ఏడాది గడిచినా ఇంకా విద్యాశాఖమంత్రిని నియమించలేదన్నారు.విద్యారంగ, గురుకులాల్లోని సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు స్టాలిన్, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, ఉపాధ్యక్షురాలు పరిమళ, జిల్లా సహాయ కార్యదర్శులు అనూషరెడ్డి, జస్వంత్, అభిషేక్, సాయికుమార్, రాజ్‌కుమార్,సందీప్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దామెర కిరణ్

నల్లబ్యాడ్జీలతో నిరసన



ఎంజీఎం : ఉద్యోగులకు రావాల్సిన బెనిఫిట్స్ రాకపోవడంతో భరత్ అనే ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై మంగళవారం ఎంజీఎం ఆస్పత్రిలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల నేత రాజేశ్ కన్నా మాట్లాడుతూ జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ సభ్యుడైన భరత్‌కు రావాల్సిన బెనిఫిట్స్‌తో పాటు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

రైస్‌మిల్లులపై చర్యలు తీసుకోవాలి

- డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి తిరుపతి



పౌరసరఫరాల కమిషనర్‌కు లేఖలు పోస్టు చేస్తున్న డీవైఎఫ్‌ఐ నాయకులు

హన్మకొండ : రైతులను, ప్రభుత్వాన్ని మోసం చేస్తున్న హనుమకొండ జిల్లాలోని నడికూడ మండలం నర్సక్కపల్లి కార్తికేయ రైస్‌మిల్, శాయంపేట మండలం గట్లకానిపర్తి లక్ష్మీనరసింహ, కమలాపురం మండలంలోని శ్రీశైలం మల్లన్న, వీరభద్ర రైస్‌మిల్‌తో పాటు గతంలో సీఎంఆర్, ఎగ్గొట్టిన, రూ.లక్షల్లో బకాయిలున్న, ప్రభుత్వానికి చెల్లించకుండా మోసం చేస్తున్న రైస్ మిల్లులపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి డి.తిరుపతి డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీ.ఎస్.చౌహాన్‌కు డీవైఎఫ్‌ఐ లేఖలు రాసింది. ఈ లేఖలను మంగళవారం హనుమకొండలో పోస్టు చేశారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ గతంలో రబీ, ఖరీఫ్ సీజన్‌లో సీఎంఆర్ బకాయిలు చెల్లించని రైస్ మిల్లులపై ఆర్ఆర్ యాక్ట్ ద్వారా ఆస్తులను వేలం పెట్టాల్సి ఉండగా ప్రభుత్వం, అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారని విమర్శించారు. డీవైఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి కె.చిరంజీవి, నాయకులు పాణి, సంజయ్, కిరణ్, రాము, సంతోష్ పాల్గొన్నారు.

బీసీలకు వాటా పెంచాలి

నయీంనగర్: స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం వాటా పెంచిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ ఆజాదీ యూత్ ఫెడరేషన్ అధ్యక్షుడు జక్కని సంజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనాభాలో సగభాగం ఉన్న బీసీలు అన్ని రంగాల్లో వెనకబడిపోతున్నారని, కాంగ్రెస్ ఎన్నికల సమయంలో చేసిన కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.7600 కోట్లు వెంటనే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో కుడికాల భాస్కర్, రాజు, చందు, మనోహర్, లక్ష్మణరావు పాల్గొన్నారు.

సంక్షిప్తం

అక్రమ రవాణాపై అప్రమత్తంగా ఉండాలి

ఖిలా వరంగల్: మనుషులను అమ్మడం, కొనడం లాంటి అనైతిక చర్యలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని మానవ అక్రమ రవాణా విభాగం (ఏహెచ్‌టీయూ) ఇన్‌స్పెక్టర్ పి.వెంకన్న, బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ వసుధ హెచ్చరించారు. మంగళవారం రంగశాయిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలలో మానవ అక్రమ రవాణా విభాగం ఆధ్వర్యంలో మానవ అక్రమరవాణా, బాలల సంక్షేమంపై అవగాహన సదస్సును ఏర్పా టు చేశారు.10 నుంచి 19 ఏళ్ల మధ్య వయ స్సు కీలకమన్నారు. కిశోర దశలోనే ప్రలోభాలకు గురై ఇతరుల చేతుల్లో మోసపోయే అవకాశం ఉందన్నారు.

గుట్కాలు స్వాధీనం

వరంగల్: వరంగల్ ఏనుమాముల మార్కెట్ సమీపంలో తోట శ్రీకాంత్ నుంచి రూ.11,460ల విలువైన నిషేధిత గుట్కా, పొగాకు ఉత్పత్తులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యల నిమిత్తం ఏనుమాముల పోలీసులకు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ ఒక ప్రకటనలో తెలిపారు.

గుట్కా విక్రయించిన వ్యక్తికి జైలు

మామునూరు: కిరాణం షాపులో నిషేధిత పొగాకు ఉత్పత్తులైన అంబర్, గుట్కా ప్యాకెట్లు విక్రయిస్తున్న వ్యక్తికి జుడిషియల్ సెకండ్ మెజిస్ట్రేట్ వెంకటేశ్వర్లు మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు మామునూరు సీఐ రమేష్ తెలిపారు. వరంగల్ ఆర్టీఏ జంక్షన్‌లో మామునూరు పోలీసుల ఆధ్వర్యంలో వాహన, కిరాణం షాపుల తనిఖీలు చేపట్టామన్నారు. తనిఖీలో వెంకటేశ్వర్లు షాపుల్లో అంబర్, వాటిపి స్వాధీన పర్చుకుని అతనిపై కేసు నమోదు చేసి మంగళవారం కోర్టులో ప్రవేశ పెట్టగా నిందితుడికి మూడు రోజులు జైలు శిక్ష విధించారు.

దళిత హక్కులే మానవ హక్కులు

హసన్‌పర్తి : దళిత హక్కులే మానవ హక్కులని డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్ అన్నారు. మండలంలోని దేవన్నపేటలో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. దళిత బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాజేందర్ పాల్గొని మాట్లాడుతూ అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని ఐక్యరాజ్యసమితి ప్రకటించి 75 ఏళ్లు గడుస్తున్నా దళితులపై లైంగిక దాడులు, హత్యల పరంపర ఇంకా కొనసాగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.

పరామర్శ

ఖిలా వరంగల్ : వరంగల్ జిల్లా ఐజేయూ కార్యదర్శి దుర్గా ప్రసాద్ తండ్రి కనకారావు మంగళవారం అనారోగ్యంతో మృతి చెందాడు. పెరకవాడలోని ఆయన స్వగృహంలో భౌతికకాయాన్ని ఉంచగా మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు మంగళవారం కనకారావు మృతదేహాన్ని సందర్శించారు. దుర్గాప్రసాద్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

సామిల్ కార్మికులు ఏఐటీయూసీలో చేరిక

ఖిలా వరంగల్: వరంగల్ దూపకుంట రోడ్డులోని సామిల్ కట్టర్స్–హెల్పర్స్ కార్మికులు తాళ్లపల్లి జాన్‌పాల్ ఆధ్వర్యంలో మంగళవారం సామిల్ కార్మికులు ఏఐటీయూసీలో చేరారు. వీరికి ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేశ్ కండువా కప్పి ఆహ్వానించారు.

టీఎన్జీఓస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా లోకేందర్‌రెడ్డి

హన్మకొండ అర్బన్ : హనుమకొండ జిల్లా టీఎన్జీఓస్ యూనియన్ ఉపాధ్యక్షుడిగా కాకతీయ మెడికల్ కళాశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కె.లోకేందర్‌రెడ్డి ఎన్నికయ్యారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ చేతుల మీదుగా నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా లోకేందర్‌రెడ్డి మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన జిల్లా కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు.

నాణ్యమైన భోజనం అందించాలి

కాజీపేట అర్బన్ : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు నాణ్యమైన మ ధ్యాహ్న భోజనం అందించాలని తహసీల్దార్ బావుసింగ్ తెలిపారు. మండలంలోని కడిపికొండ ఎస్సీ కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, ఉర్దూ మీడియం పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలను మంగళవారం ఆయన పరి శీలించారు.

నిట్‌ను సందర్శించిన కేవీ విద్యార్థులు



కాజీపేట అర్బన్ : మండలంలోని పీఎం కేంద్రీయ విద్యాలయ పాఠశాల విద్యార్థులు ఎడ్యుకేషన్ టూర్‌లో భాగంగా మంగళవారం నిట్ వరంగల్ క్యాంపస్‌ను సందర్శించారు. నిట్‌లోని తరగతి గదులు, ల్యాబ్స్, వర్క్‌షాపులు, సెమినార్ హాల్స్, క్యాంపస్ ప్రాంగణం, అంబేద్కర్ లర్నింగ్ సెంటర్ ఆడిటోరియం, నిట్ ప్రధాన భవనాన్ని పరిశీలించారు.

శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి

కాజీపేట అర్బన్ : బీఎన్ఆర్‌కేఎస్ శిక్షణ తరగతులను ఈనెల 14, 15వ తేదీల్లో నిర్వహించనున్నట్లు బీఎన్ఆర్‌కేఎస్ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా ఇన్‌చార్జ్ పంకెర్ల కుమారస్వామి తెలిపారు. మండలంలోని కడిపికొండలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శిక్షణా తరగతులకు భవన నిర్మాణ రంగ కార్మికులు హాజరు కావాలని పిలుపునిచ్చారు.

బీడీ కార్మికుల పోరాటాలకు సిద్ధం కావాలి

వరంగల్ చౌరస్తా : సమస్యల పరిష్కారం కోసం బీడీ కార్మికుల పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐటీయూసీ వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి ఖాసీం కోరారు. మంగళవారం 27వ డివిజన్ లక్ష్మీపురంలో మద్రాసి చెక్కర బీడీ బ్రాంచ్ బీడీ కార్మికులతో మాట్లాడుతూ బీడీ కార్మికుల పరిస్థితి ఘోరంగా తయారైంది. బీడీ యజమానులు పట్టుమని పది రోజులు కూడా పని కల్పించడం లేదన్నారు. బీడీ సిగార్ చట్టం 1966 ప్రకారం నెలకు 26 రోజులు పని కల్పించాల్సిన నిబంధనను పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు.

ప్రజావ్యతిరేక పాలన సాగిస్తున్న బీజేపీ

వరంగల్: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు దారాదత్తం చేస్తూ సామాన్య పేద ప్రజలను ఇబ్బంది పెట్టే ఆర్థిక విధానాలను అవలంబిస్తూ ప్రజావ్యతిరేక పాలన సాగిస్తున్న బీజేపీపై ప్రజలు పోరాటాలు చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి నాయకుడు పంజాల రమేశ్ పిలుపునిచ్చారు. వరంగల్ పైడిపల్లిలో జన్ను రవి అధ్యక్షతన మంగళవారం మండల సమితి సమావేశం జరిగింది. సమావేశంలో ముఖ్యఅతిథిగా రమేష్ హాజరై మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని రైతు భరోసాను వెంటనే విడుదల చేసి రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు. సీపీఐ వరంగల్ జిల్లా సహాయ కా ర్యదర్శి పనాస ప్రసాద్, వరంగల్ మండల కార్యదర్శి బుస్సా రవీందర్, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పంజాల రమేశ్

అర్ధరాత్రి తనిఖీలు



కేయూ జంక్షన్ వద్ద మొహరించిన పోలీసులు

హసన్‌పర్తి: కేయూ జంక్షన్, వడ్డెపల్లి చర్చి ప్రాంతాల్లో సోమవారం రాత్రి 10 గంటల నుంచి రాత్రి ఒంటిగంట వరకు పోలీసులు తనిఖీలు నిర్వహించారు. కాకతీయ పోలీస్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారించారు. మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేశారు. పత్రాలు లేకుండా వాహనాలు నడుపుతున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. కార్యక్రమంలో ఎస్సైలు హరిత, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలి

- బల్దియా డిప్యూటీ కమిషనర్ కృష్ణారెడ్డి
- సీఎం కప్ పోటీలు ప్రారంభం



వరంగల్ అర్బన్ : క్రీడలను ప్రారంభిస్తున్న బల్దియా డిప్యూటీ కమిషనర్ కృష్ణారెడ్డి

వరంగల్ అర్బన్ : క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని బల్దియా డిప్యూటీ కమిషనర్ కృష్ణారెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్–2024 క్రీడా పోటీలు మంగళవారం వరంగల్ ఓ సిటీ స్టేడియంలో లాంఛనంగా ప్రారంభమయ్యాయి. బల్దియా డిప్యూటీ కమిషనర్, అధికారులు, కార్పొరేటర్లు పాల్గొని క్రీడాకారులను పరిచయం చేసుకుని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్బన్ లెవెల్ స్థాయిలో వరంగల్, ఖిలా వరంగల్ మండలాలకు సంబంధించి పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తొలి రోజు ఖోఖో, వాలీబాల్ పోటీలు జరిగాయి. కార్యక్రమంలో కార్పొరేటర్లు చింతాకుల అనిల్, గుండు చందన, అరుణ విక్టర్, సీఎంహెచ్‌ఓ డాక్టర్ రాజారెడ్డి, డీఎఫ్‌ఓ శంకర్ లింగం, ఇన్‌చార్జ్ సీపీ రవీందర్ రాడేకర్, ఎంహెచ్‌ఓ రాజేష్ , ఎంఈఓలు, ఫిజికల్ డైరెక్టర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

నేడు, రేపు జేఎన్ఎస్‌లో..

హన్మకొండ, కాజీపేట మండలాల పరిధిలోని క్రీడలు జేఎన్ఎస్‌లో నిర్వహిస్తున్నట్లు కాజీపేట బల్దియా డిప్యూటీ కమిషనర్ గొడిశాల రవీందర్ గౌడ్ తెలిపారు. 11న హన్మకొండ మండలం, 12న కాజీపేట మండల పరిధిలోని క్రీడలు ఏర్పాటు చే యడం జరిగిందన్నారు. బుధవారం జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో బల్దియా మేయర్ గుండు సుధారాణి, పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డిలు ముఖ్యఅతిథిగా హాజరై క్రీడలను ప్రారంభించనున్నారని పేర్కొన్నారు.

హసన్‌పర్తి: విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు అవసరమని కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీఎం కప్–24 క్రీడాపోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. మండల స్పెషల్ ఆఫీసర్ వెంకటేశం , ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, ఎంపీఓ కర్ణాకర్‌రెడ్డి, మండల స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ రమేష్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం

- రాష్ట్ర ఆటోట్రాలీ డ్రైవర్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్

వరంగల్ చౌరస్తా : ఆటో డ్రైవర్ల న్యాయమైన డిమాండ్లను గత బీఆర్ఎస్, ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కరించడంలో విఫలం చెందాయని తెలంగాణ రాష్ట్ర ఆటో ట్రాలీ డ్రైవర్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశ్ విమర్శించారు. మంగళవారం వరంగల్ చౌర్‌బౌళిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆటోయూనియన్ నాయకుడు ఎండీ.మహబూబ్ పాషా ఆధ్వర్యంలో సీఐటీయూ నుంచి ఏఐటీయూసీలోకి భారీగా చేరికలు జరిగాయి. సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వెంకటేశ్ మాట్లాడుతూ ఆటో కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న పాలకులపై పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఎన్నికల మేనిఫెస్టోలో ఆటోడ్రైవర్లకు అధికారంలోకి రాగానే సంవత్సరానికి రూ.12,000 ఇస్తామని, ఆటో మోటార్ రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి విస్మరించిందని విమర్శించారు. సమావేశంలో ఏఐటీయూసీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేశ్ ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షులు ప్రసాద్ , జిల్లా అధ్యక్షుడు కందిక చెన్నకేశవులు, ఆటో యూనియన్ అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శులు ఎండీ.అక్బర్, గుండె బద్రి పాల్గొన్నారు.

అదానీ అవినీతిపై విచారణ జరిపించాలి

- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి



ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు, కార్యకర్తలు

హన్మకొండ: గౌతమ్ అదానీ అవినీతిపై న్యాయవిచారణ జరిపించాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస రావు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ సీపీఐ హనుమకొండ జిల్లా సమితి ఆధ్వర్యంలో హనుమకొండలోని కాళోజీ కూడలిలో ధర్నా నిర్వహించారు. సీపీఐ నాయకులు, కార్యకర్తలు ప్లకార్డులు చేతబూని అదానీని అరెస్టు చేయాలని, అధిక ధరలను నియంత్రించాలని నినాదాలు చేశారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం, దేశంలోని ప్రజా సంపదను కొల్లగొడుతున్న కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తుందని ధ్వజమెత్తారు. సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, నాయకులు శ్రీనివాస్, ఎల్లేష్, లక్ష్మణ్, భిక్షపతి, సంతోష్, సారంగపాణి, శంకర్, నర్సయ్య పాల్గొన్నారు.

తుగ్లక్ పాలన సాగిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి



హన్మకొండ : తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్‌వీ నాయకులు



పడమరకోటలోని నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్‌నేతలో మాజీ ఎమ్మెల్యే నరేందర్

హన్మకొండ: రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి తుగ్లక్ పాలన సాగిస్తున్నారని భారత రాష్ట్ర సమితి విద్యార్థి (బీఆర్ఎస్‌వీ) విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శరత్‌చంద్ర, హనుమకొండ జిల్లా కో ఆర్డినేటర్ గంద్రకోట రాకేష్ యాదవ్ దుయ్యబట్టారు. మంగళవారం బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో తెలంగాణ తల్లికి బీఆర్ఎస్‌వీ నాయకులు క్షీరాభిషేకం చేశారు.

గాంధీ భవన్‌కే పరిమితం

ఖిలా వరంగల్: కాంగ్రెస్ తల్లి విగ్రహం గాంధీ భవన్‌కే పరిమితం అవడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. మంగళవారం పడమరకోటలో నరేందర్ ఆధ్వర్యంలో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించారు.

హసన్‌పర్తి: తెలంగాణ తల్లి నెత్తిపై కిరీటం మాయం చేశారు. చేతిలో బతుకమ్మను లేకుండా చేసి ఆ తల్లిని అవమానపరిచారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు డాక్టర్ బండి రజనీకుమార్ అన్నారు. మంగళవారం 1వ డివిజన్ ఎర్రగట్టు జంక్షన్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు.

తెలంగాణ తల్లి రూపం మార్చటం సరికాదు

కేయూ క్యాంపస్: తెలంగాణ తల్లి రూపాన్ని మార్చాలనుకోవటం సరికాదని బీఆర్ఎస్‌వీ కేయూ ఇన్‌చార్జ్ జెట్టి రాజేందర్ అన్నారు. మంగళవారం బీఆర్ఎస్‌వీ కేయూ శాఖ ఆధ్వర్యంలో మొదటి గేట్ వద్ద తెలంగాణ తల్లి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు.

అయ్యప్ప నామస్మరణతో మార్మోగిన మెట్టుగుట్ట

మడికొండ: అయ్యప్ప స్వాముల భజనలతో మెట్టుగుట్ట ప్రాంతం మార్మోగింది. వేణుగోపాలస్వామి ఆలయం నుంచి మంగళవారం ఉదయం ఊరేగింపుగా స్వామివారిని మెట్టుగుట్టపై ఉన్న పాలగుండం వరకు భక్తిపాటలు, నృత్యాలతో అయ్యప్పలు తీసుకెళ్లారు. పాలగుండంలో అర్చకులు ముష్కె శ్రీకాంత్, గురుస్వాములు పైడిపాల రఘుచందర్, సతీష్‌కుమార్, నర్సింగరావు, మోహన్, రాజేందర్, రాజన్‌బాబు, మంత్రోచ్ఛరణల మధ్య వైభవంగా అయ్యప్ప విగ్రహానికి పాలు, పెరుగు, పంచామృతాలచే అభిషేకం, మహాపడిపూజ నిర్వహించారు. అనంతరం దువ్వ సదానందం–సుమతి దంపతులు అయ్యప్పలకు సుమారు 400 మందికి అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

వైభవంగా అయ్యప్ప మహాపడిపూజ

హన్మకొండ అర్బన్ : నగరంలోని పద్మాక్షి కాలనీలోని పద్మాక్షి దేవస్థానంలో పద్మాక్షి అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో సోమవారం అయ్యప్ప పడిపూజ వైభవంగా నిర్వహించినట్లు ఆలయ అర్చకులు నాగిళ్ల శంకర్‌శర్మ తెలిపారు. అనంతరం అయ్యప్ప మాలధారులు, భక్తులకు మహాన్నదానం కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు.